సాక్షి
జోగులాంబ గద్వాల

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



శాంతించిన కృష్ణమ్మ
ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద మరింత తగ్గుముఖం పట్టింది.

వివరాలు 8లో ▸



తెగిన కేఎల్ఐ కాల్వలు
ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో కేఎల్ఐ కాల్వలకు గండ్లు పడ్డాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 33.3 /23.1
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యాజమాన్య పద్ధతులు పాటించాలి



అయిజ: రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక వర్షాల నుంచి పంటలను కాపాడుకోవచ్చని ఇన్‌చార్జ్ జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ అన్నారు. బుధవారం అయిజ శివారులో వర్షం వలన దెబ్బతిన్న పంటలను ఆయనతోపాటు ఎంఏఓ జనార్ధన్ పరిశీలించారు. ఈసందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాల నుంచి పంటలను కాపాడుకునేందుకు యాజమాన్య పద్ధతులు పాటించాలని అన్నారు. ముందుగా పంట పొలాల్లో నిలిచిన మురుగునీటిని తొలగించాలని, రాబోయే రెండు మూడు రోజులు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని, దానివల్ల పంటలపై ఎలాంటి మందులు పిచికారీ చేయరాదన్నారు. వర్షాలు తగ్గిపోయే వరకు వాయిదా వేసుకోవాలని సూచించారు. ముంపునకు గురైన పంటలు త్వరగా కోలుకోవడానికి 10 గ్రా.యూరియా లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

గద్వాల క్రైం: గద్వాల ఆర్టీసీ ఉద్యోగులు నిజాయితీ చాటుకున్నారు. రూ.2లక్షల నగదుతో కూడిన హ్యాండ్ బ్యాగును ప్రయాణికురాలు బస్సులో మరిచిపోగా.. తిరిగి దానిని ఆమెకు అప్పగించారు. పూర్తి వివరాలిలా.. బుధవారం ఉదయం గద్వాల నుంచి హైద్రాబాద్ వెళ్లే బస్సులో రాధ తన ఇద్దరు పిల్లలతో కలిసి ప్రయాణం చేసింది. ఈ క్రమంలో హైద్రాబాద్ బస్టాండ్‌లో హడావుడిగా బస్సు దిగి వెళ్లిపోయింది. అయితే బస్సులో తన హ్యాండ్ బ్యాగ్‌ను మరిపోయింది. బస్సు డ్రైవర్ భగవంతు, కండక్టర్ కిరణ్‌కుమార్ బస్సులో మరిచిపోయిన బ్యాగ్‌ను గమనించి హైద్రాబాద్ ఆర్టీసీ అధికారులకు బ్యాగ్‌ను అప్పగించారు. బ్యాగ్ మరచిపోయిన ప్రయాణికురాలు ఆధార్ కార్డు ఆధారంగా గుర్తించి సిబ్బంది ప్రయాణికురాలికి సమాచారం అందించారు. దీంతో బస్టాండ్‌కు చేరుకున్న సదరు మహిళకు బ్యాగ్‌ను అందించారు. అందులోని రూ.2లక్షల నగదు అలాగే ఉండడంతో సంతోషం వ్యక్తం చేసింది. నిజాయితీ చాటుకున్న సిబ్బందిని అక్కడి సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. గద్వాల డిపో మేనేజర్ హర్షం వ్యక్తం చేశారు.

తెగిన కల్వర్టును పరిశీలించిన ఎమ్మెల్యే

కేటీదొడ్డి: రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఈర్లబండ పాతపాలెం గ్రామాలకు మధ్య ఉన్న కల్వర్టు తెగిపోవడంతో బుధవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కాకుండా ట్రాక్టర్ల ద్వారా మట్టి వేయించి రోడ్డు మరమ్మతు పనులు చేయించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ నల్ల హనుమంతు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, ఉరుకుందు, గోవిందు, వెంకన్‌గౌడు, కృష్ణ, అమ్రేష్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

గట్టు చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే

గట్టు: వర్షాల వల్ల గట్టు చెరువులోకి నీరు చేరడంతో బుధవారం సాయంత్రం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పరిశీలించారు. చెరువు కాల్వ నీరు ఇలాగే పారితే మరో వారం రోజుల్లో చెరువు పూర్తి స్థాయిలో నిండుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

హిందువులపై దాడులను అరికట్టాలి

శాంతినగర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండ, అత్యాచారాలను, హింసను అరికట్టాలని హిందూ సంఘం నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు నిరసనగా వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో కుల సంఘాలతో పాటు ఆయా పాఠశాలల విద్యార్థులు కాషాయ జెండాలు పట్టుకుని బుధవారం శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. దాడులకు నిరసనగా శాంతినగర్ బంద్‌కు పిలుపునివ్వడంతో అందరు దుకాణాలు స్వచ్ఛందంగా బంద్ చేశారు. ప్లకార్డులతో అలంపూర్-రాయచూర్ రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. హిందువులంతా ఏకమై మన ధర్మాన్ని కాపాడడంతోపాటు ప్రపంచంలోని హిందువులను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇదిలాఉండగా, ఎస్ఐ సంతోష్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కులసంఘాలు, వివిధ పార్టీల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చల్లారని రగడ

- రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, నూతన మార్కెట్ చైర్మన్‌ను బాధ్యులు చేస్తూ పిటిషన్
- హడావుడిగా మార్కెట్‌యార్డు నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం
- ప్రభుత్వానికి తలనొప్పిగా మారిన రాజకీయ వర్గపోరు

పదవి ఇస్తానని మోసం చేశారంటూ హైకోర్టును ఆశ్రయించిన లక్ష్మణ్



గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కుర్వ హనుమంతు

గద్వాల: అటు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి.. ఇటు జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గాల మధ్య వివాదం ఎంతకూ చల్లారడం లేదు. గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటీ తమ వారికే దక్కాలంటూ ఇరువురు రెండు లిస్టులు పంపడం.. ఎమ్మెల్యే పంపిన లిస్టునే ప్రభుత్వం ఫైనల్ చేసి మూడురోజుల క్రితం జీఓ జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో నిరాశకు గురైన సరిత వర్గంలోని లక్ష్మణ్ పదవి ఇస్తానని ఆశచూపి మోసం చేశారంటూ హైకోర్టును ఆశ్రయించడం, అందులోనూ రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, పలువురిని బాధ్యులను చేస్తూ కేసు వేయడం సంచలనంగా మారింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలిలా..

హైకోర్టులో కేసు

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత కమిటీ ఏర్పాటు కోసం పంపిన పేర్లలో ఎమ్మెల్యే వర్గానికే మార్కెట్‌యార్డు కమిటీని కట్టబెడుతూ ప్రభుత్వం ఈనెల 1వ తేదీన జీఓ విడుదల చేసింది. దీంతో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గం ఒక్కసారిగా నిరాశకు గురైంది. ఈక్రమంలోనే సరిత వర్గానికి చెందిన గద్వాల మండలం శెట్టి ఆత్మకూరుకు చెందిన వ్యక్తి లక్ష్మణ్ తనకు అన్యాయం జరిగిందని హైకోర్టును ఆశ్రయించాడు. తనకు మార్కెట్ కమిటీ సభ్యుడిగా అవకాశం ఇస్తామని ఆశపెట్టి మోసం చేశారని పేర్కొంటూ ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి, జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, మార్కెట్‌యార్డు ఏడీ, కార్యదర్శి, గద్వాల నూతన మార్కెట్ చైర్మన్ కుర్వ హనుమంతు, కమిటీ సభ్యులతో పాటు గద్వాల మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌ను బాధ్యులుగా పేర్కొంటూ ఈ నెల 3న హైకోర్టులో కేసు వేశాడు. కేసు విషయం తెలిసిన నూతన మార్కెట్ కమిటీచైర్మన్ కుర్వ హనుమంతు తన కమిటీ సభ్యులతో కలిసి బుధవారం హడావిడిగా ప్రమాణ స్వీకారం చేయడం చర్చనీయంశమైంది.

ప్రభుత్వానికి తలనొప్పి..

గద్వాల రాజకీయాలు ప్రభుత్వ పెద్దలకు తలనొప్పిగా మారాయి. ఇరువర్గ నాయకులు ఆధిపత్యం కోసం జరుగుతున్న వరుస ఘటనలు పార్టీపై, ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయే పరిస్థితి నెలకొందని పార్టీ ముఖ్యనేతలే మాట్లాడుతుండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. నామినేటెడ్ పోస్టుల కేటాయింపు సైతం తప్పుపడుతూ పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించే విధంగా కోర్టుకు ఎక్కడం ఎన్నడూ చూడలేదని ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ ముఖ్యనేత వ్యాఖ్యలు చేయడం విశేషం.

మార్కెట్ కమిటీ చుట్టూ రాజకీయాలు

గద్వాల మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఏర్పాటు విషయమై ఇరు వర్గాల మధ్య మొదటి నుంచి ఆధిపత్య పోరు నెలకొంది. మొదట వ్యవసాయ మార్కెట్‌కు నూతన చైర్మన్‌తో పాటు కమిటీని ఎంపిక చేయాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ హోదాలో జూన్ 18న ప్రభుత్వానికి లేఖ రాశారు. అలాగే, ఆమె తన వర్గీయులు చైర్‌పర్సన్‌గా ధనలక్ష్మి, వైస్‌చైర్మన్‌గా గోవర్ధన్, సభ్యులుగా లక్ష్మన్న, షఫీఅహ్మద్, వెంకటేష్, నర్సింహులు, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, శాంతమ్మ, రంగస్వామి, రాఘవేంద్రారెడ్డి, నడిపి నర్సింహులు, తెలుగు నర్సింహులు, ఎండీ గౌస్, మహదేవమ్మ పేర్లతో కూడిన లేఖను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు పంపారు. అయితే మార్కెట్ కమిటీ ఏర్పాటు వ్యవహారం వెనకాల పెద్దఎత్తున ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు అప్పట్లో బలంగా వినిపించాయి. ఈక్రమంలోనే ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి మంత్రి జూపల్లి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో మార్కెట్ కమిటీ ఎంపిక ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయింది. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే బండ్ల ఆగస్టు 12న వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన కమిటీని ఎంపిక చేయాలని తన వర్గీయుల పేర్లతో కూడిన లిస్టు ప్రభుత్వానికి పంపించారు. అందులో చైర్మన్‌గా కుర్వ హనుమంతు, వైస్ చైర్మన్‌గా శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులుగా చంద్రశేఖర్‌రెడ్డి, చాకలి ఆంజనేయులు, వెంకట్‌రాజు, తిరుపతి, విశ్వగ్యాన్ ఆచారి, లతితమ్మ, నర్సింహరాజు, కళ్యాణం సోమన్న, రూప్లనాయక్, బజారి, రామయ్య, షాహీన్‌బానుల పేర్లు ఉన్నాయి. జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం ఎమ్మెల్యే బండ్ల పంపిన పేర్లను ఆమోదించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు సిఫారసు చేశారు.



గద్వాల వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

సమాజ నిర్మాతలు.. ఉపాధ్యాయులు



అజ్ఞానాంధకారాన్ని పారదోలి జీవితానికి వెలుగు బాటను ప్రసాదించే గురువు రుణాన్ని శిష్యుడు ఏ రూపంలోనూ తీర్చుకోలేడు. అందుకే మాతృదేవోభవ.. పితృదేవోభవ తర్వాత గురువుకే ఆ స్థానం ఇచ్చారు... ఉపాధ్యాయ వృత్తి అంటే ఏదో నాలుగు పాఠాలు చెప్పామా.. వెళ్లామా.. అని కాకుండా కొంతమంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఔరా అనిపించుకుంటున్నారు. చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతూ.. సమాజ నిర్మాతలుగా తమకంటూ ప్రత్యేక గుర్తింపును పొందుతున్నారు. వృత్తికి న్యాయం చేస్తూ పిల్లల ఉన్నతికి కృషి చేస్తూ అవార్డులు, ప్రశంసలు సైతం పొందుతున్నారు. గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిపై ప్రత్యేక కథనాలు..

సమర్థ పౌరులుగా తీర్చిదిద్దేలా బోధన




వనపర్తి: 35 ఏళ్ల సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో దేశానికి సమర్థులైన పౌరులను అందించాలనే తపనతో పనిచేస్తూ వస్తున్నానని వలుస శంకర్‌గౌడ్ చెప్పారు. పెబ్బేరు మండలం యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంగా పని చేస్తున్న ఆయన వనపర్తి జిల్లా నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన తొలినాళ్ల నుంచి తాను విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యత కలిగి ఉండేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణ, అక్షర మేళా, విలువల మేళా, బాల్యవివాహాలను అరికట్టేలా విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులకు పూల, పండ్ల మొక్కలను అందించి, ఇంటి ఆవరణలో పెంచేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పుట్టిన రోజున కేక్ కట్ చేసే విదేశీ సంప్రదాయాన్ని విడనాడి, పుట్టిన రోజున మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించేలా కొత్త ఆలోచనలు, అలవాట్లను పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డు తీసుకోనుండటం చాలా ఆనందంగా ఉందన్నారు.

సృజనాత్మకతకు కేరాఫ్ నర్సింహులు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకునే విధంగా బోధించేందుకు కొందరు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అందులో ఒకరు కోళ్ల నర్సింహులు. ప్రస్తుతం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలంలోని ఇబ్రహీంనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. తొమ్మిదేళ్ల పాటు ఇప్పటూర్‌లో పనిచేశారు. అక్కడే ఆయన టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) రూపొందించారు. విద్యార్థులకు అనుభవ పూర్వక, నాటకీయ విధానాల ద్వారా గణితం, సైన్స్, సోషల్ వంటి సబ్జెక్టులను బోధిస్తున్నారు. ఆయన స్వతహాగా చేసిన పలు టీఎల్ఎంల ద్వారా విద్యార్థులకు బోధిస్తూ ఉత్తమ ఫలితాలు రాబడుతున్నారు. అందరికీ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అందుబాటులో ఉండేలా నోకాస్, లోకాస్ట్ విధానంతో తయారు చేశారు. అందులో ముఖ్యంగా చార్ట్‌లు, నమూనాలు, ఫ్లాష్‌కార్డులు, దృశ్య విధానం ద్వారా బోధించడం, గణితలో బరువులు, ఎత్తులు వంటి వాటికి ప్రత్యేక మెటీరియల్ రూపొందించారు. విద్యార్థులకు ఎక్కువగా గుర్తు ఉండే విధంగా సబ్జెక్టులోని ప్రతి అంశాన్ని కూడా నాటకీయ పద్ధతిలో బోధించే విధంగా ఆయన చర్యలు తీసుకుంటున్నారు.

వినూత్న బోధనకు గుర్తింపు



విద్యార్థులకు నామమాత్రపు బోధనతో ఎలాంటి తృప్తి ఉండదు. కొత్త పద్ధతుల్లో విభిన్నమైన రీతిలో బోధించడంతో విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటున్నారు. చదువుపై మక్కువ పెంచుకుంటున్నారు. రోజు బడికి రావడానికి ఇష్టపడుతున్నారు. అందుకోసం టీఎల్ఎంను స్వతహాగా రూపొందించా. గణితంలో ఎక్కాల చక్రం, స్నేక్, ల్యాండర్ గేమ్, నంబర్స్, ఆల్ఫాబెట్స్ కాన్సెప్ట్ గేమ్ పేరుతో విద్యార్థులకు బోధిస్తున్నా. సోషల్ మీడియాలో కూడా దేశ విదేశాలకు చెందిన నా ఫాలోవర్స్ 1.77 లక్షల మంది ఉన్నారు. వారు కూడా నా టీఎల్ఎంను ఇవ్వాలని కోరుతున్నారు. చాలా మంది నా టీఎల్ఎంను వినియోగించేందుకు ఇష్టపడుతున్నారు.

– దాయపల్లి కవిత, యూపీఎస్ చిన్నరాజమూరు

వృత్తిపై నిబద్ధతతో..



నారాయణపేట రూరల్: కోటకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం సునీత నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు చక్కటి ప్రణాళికలను అమలు పరుస్తున్న ఆమె రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. 1989లో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయురాలిగా ఎంపికైన ఆమె.. పలు పాఠశాలల్లో పనిచేశారు. ఇటీవల జీహెచ్‌ఎంగా పదోన్నతిపై కోటకొండ జెడ్పీహెచ్ఎస్‌కు వచ్చారు. పాఠశాలలో స్వచ్ఛభారత్.. మొక్కలు నాటడం.. బడిబాటలో చురుకుగా పాల్గొని ఎంతో మంది బడిబయటి చిన్నారులను పాఠశాలలో చేర్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అన్ని వర్గాల పండగల విశిష్టత తెలియజేస్తున్నారు. సైన్స్‌ఫెయిర్, వార్షిక పరీక్షల్లో విద్యార్థులు రాణించే విధంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు.

ప్రత్యేకమైన గుర్తింపుతో మరింత బాధ్యత పెరుగుతుంది. ఒకే ఏడాది జీహెచ్‌ఎంగా పదోన్నతి లభించడం.. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు రావడం ఆనందంగా ఉంది. విద్యార్థుల ఉన్నతికి ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలతో పాటు వినూత్న పద్ధతులకు శ్రీకారం చుడతాను.

– టి.సునీత, జీహెచ్ఎం, కోటకొండ

విద్యార్థులతో ప్రయోగాలు..



సాక్షి, నాగర్‌కర్నూల్: విద్యార్థులకు బయోసైన్స్ పాఠాలు చెప్పే రాజశేఖరరావు తరగతి గదిలో పాఠాలతో పాటు నిజజీవితంలోనూ సమస్యలకు పరిష్కారం చూపేలా విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్నారు. వారితో జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలు చేయించి ప్రశంసలు అందుకుంటున్నారు. ఇప్పటికే కేరళలో నిర్వహించిన 'నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థులతో కలసి ప్రదర్శనలిచ్చారు. ఔషధమొక్కల ఆకులచూర్ణంతో కూరగాయలను ఎక్కువ కాలం పాటు నిల్వచేసే విధానాన్ని ఆవిష్కరించారు. 'ఇండియన్ ఇంటర్నేషన్ సైన్స్ ఫెస్టివల్'లో కవిత్వం విభాగంలో జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచి అవార్డును పొందారు. గతేడాది పర్యావరణ పరిరక్షణ, అటవీభూముల్లో పచ్చదనం పెంచేందుకు విద్యార్థులతో సీడ్‌బాల్స్ తయారు చేయించారు. మానవుని మెదడులోని భాగాలను వర్ణించేందుకు హెల్మెట్ రూపంలో మోడల్‌ను తయారుచేసి విద్యార్థులతో వివిధ ప్రదర్శనలు చేయించారు.

'రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు పొందటం సంతోషంగా ఉంది. ఈ అవార్డు నా బాధ్యతలను మరింత పెంచింది. భవిష్యత్‌లోనూ విద్యార్థుల మనోవికాసానికి, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తాను. నా సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు ధన్యవాదాలు.'

– తల్పునూరు రాజశేఖరరావు, ఉపాధ్యాయుడు, చిన్నముద్దునూర్

బడిని బతికించి.. ఆదర్శంగా నిలిపి..

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని కల్వకుర్తి మండలం జీడిపల్లితండాలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పెంటమరాజు రఘురామరావు ఎస్జీటీ విభాగంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. రఘురామరావు రెండునెలల కిందటి వరకు కల్వకుర్తి మండలంలోని బెక్కర ప్రాథమిక పాఠశాలలో పని చేశారు. మొదట ఐదుగురు విద్యార్థులకే పరిమితమై మూసివేతకు సిద్ధంగా ఉన్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 35కు పెంచడంలో విశేషంగా కృషి చేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి గ్రామస్తులు దాతల నుంచి విరాళాలు సేకరించారు. గ్రామస్తులు సైతం స్పందించి రూ.12 లక్షలు విరాళంగా అందించారు. దాతల సహకారంతో బెక్కర ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదుల్లో గ్రానైట్ ఫ్లోరింగ్, బెంచీలు, కుర్చీలు, టీవీ, ప్రొజెక్టర్, విద్యార్థులకు ఆట వస్తువులు, స్పోర్ట్స్ యూనిఫాం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించారు. టీచర్ లెర్నింగ్ మెటీరియల్ విధానంలో గణితం, సైన్స్, ఇంగ్లిష్ వంటి సబ్జెక్టులను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించారు. పాఠశాలలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు, హరితహారం వంటి కార్యక్రమాలతో ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. పాఠశాలలో విద్యార్థుల డ్రాపౌట్స్ లేకుండా చూడటంతో కీలకంగా వ్యవహరించారు. రఘురామరావు కృషిని గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ టీచర్ అవార్డుతో సత్కరించనుంది.



సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనలో రఘురామరాజు

అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ కట్టడాలను ప్రొక్లెయినర్ సాయంతో తొలగిస్తున్న సిబ్బంది

అయిజ: మున్సిపాలిటీలో అక్రమంగా చేపట్టిన కట్టడాలను మున్సిపల్ అధికారులు బుధవారం కూల్చివేశారు. పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా వ్యాపార దుకాణాల యజమానులు రోడ్డు వైపు మెట్లు, రేకుల షెడ్లు నిర్మించడంతో రోడ్డు వెడల్పు తగ్గి ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని, రోడ్డు పక్కన వాహనాలు నిలిపేందుకు వీలు లేకుండా పోయిందని ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశానుసారం మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేసే కార్యక్రమానికి పూనుకున్నారు. ప్రొక్లెయినర్ సాయంతో రోడ్డును ఆక్రమించిన కట్టడాలతోపాటు చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న తోపుడు బండ్లు, షెడ్లు, గుడారాలను తొలగించారు. వ్యాపార దుకాణాల యజమానులు అధికారులకు సహకరించాలని మున్సిపల్ అధికారులు కోరారు.

పంటలు ముంపునకు గురికాకుండా చూడండి



అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న కొంకల రైతులు

శాంతినగర్: భారత్‌మాల ఆరులైన్ల రహదారిపై కొంకల సమీపంలో నిర్మిస్తున్న వంతెనకు అదనంగా రంధ్రాలు ఏర్పాటుచేసి పంటలు ముంపునకు గురవకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసులుకు కొంకల రైతులు బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామ సమీపంలోని రాజోళి వాగుపై వంతెన నిర్మిస్తున్నారని, రంధ్రాలు కేవలం రెండు మాత్రమే ఏర్పాటుచేయడంతో 12 గ్రామాల నుంచి వచ్చే వర్షపునీరు రెండు రంధ్రాల్లో సరిపోక సమీపంలోని 60 ఎకరాల పంట పొలాలు నీటిలో మునిగి నష్టపోతున్నామని రైతులు తెలిపారు. ఈవిషయమై భారత్‌మాల కాంట్రాక్టర్‌తో మాట్లాడి అదనంగా రంధ్రాలు ఏర్పాటుచేసి తమకు న్యాయం చేయాలని రైతులు నాగరాజు, వెంకట్రాముడు, మౌలాలి, ఉషేన్, మద్దిలేటి, బీచుపల్లి తెలిపారు. సానుకూలంగా స్పందించిన అడిషనల్ కలెక్టర్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తానని భరోసా ఇచ్చినట్లు రైతులు వివరించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


శ్రీనివాసులు(ఫైల్)

కొత్తకోట రూరల్: రాత్రి సమయంలో హైవేపై ఎలాంటి పార్కింగ్ లైట్స్ వేసుకోకుండా ఆగిఉన్న లారీని బైక్‌పై వెళ్తున్న యువకుడు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి ముమ్మళ్లపల్లి ఎన్‌హెచ్ 44పై చోటుచేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల మేరకు.. వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు(28) మంగళవారం మధ్యాహ్నం పెద్దమందడి మండలం అల్వాలలో బంధువు శుభకార్యానికి బైక్‌పై వెళ్లాడు. ఫంక్షన్ ముగించుకుని తిరిగి రాత్రి సమయంలో స్వగ్రామానికి వెళ్తుండగా కొత్తకోట మండలం ముమ్మళ్లపల్లి గ్రామ సమీపంలో హైవేపై ఆగిఉన్న లారీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వనపర్తి మార్చురీకి తరలించారు. అతని భార్య జనుంపల్లి సంధ్య ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

లారీ, బొలెరో ఢీ : డ్రైవర్ మృతి

రాజాపూర్ (బాలానగర్): ముందు వెళ్తున్న లారీని వెనక నుంచి బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందిన ఘటన బుధవారం బాలానగర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా ప్యాపిలి మండలంలోని పోతిదొడ్డికి చెందిన శివయ్య(32) బొలెరో వాహనంలో టమాటాల లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్నాడు. బాలానగర్‌కు చేరుకోగానే ఎన్‌హెచ్44పై ముందు వెళ్తున్న లారీని బొలెరో వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో బొలెరో డ్రైవర్ శివయ్యకు తీవ్రగాయాలై వాహనంలోనే ఇరుక్కుపోయాడు. గమనించిన స్థానికులు డ్రైవర్‌ను బయటికి తీశారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపాజీ తెలిపారు.

చికిత్స పొందుతూ..

మక్తల్: లారీని బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ మండలం గుడిగండ్లకి చెందిన కర్రెం శివయ్య(45) మంగళవారం జక్లేర్ నుంచి బైక్‌పై వెళ్తున్న సమయంలో ఆగిన లారీని ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహబూబ్‌నగర్‌లో ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ సంఘటనపై మృతుడు తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలియజేశారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నీటిలో పడి వ్యక్తి..

దేవరకద్ర రూరల్: ప్రమాదవశాత్తు నీటిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన వెంకటాయపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సంకటి మల్లేష్(30) బుధవారం ఉదయం బహిర్భూమికని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గ్రామ సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు చేరిన వరద నీటిలో, ఓ వ్యక్తి పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. అతడిని బయటకు తీయగా.. సంకటి మల్లేష్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించారు.

శాంతించిన కృష్ణమ్మ


జూరాల జలాశయం నుంచి దిగువకు పారుతున్న వరద

- ప్రాజెక్టుకు 1.28 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 15 గేట్లు ఎత్తి 1,05,540 క్యూసెక్కులు దిగువకు విడుదల

ధరూరు/ఆత్మకూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద బుధవారం మరింత తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో 2.20 లక్షల క్యూసెక్కులు ఉండగా.. బుధవారం సాయంత్రానికి 1.28 లక్షల క్యూసెక్కులకు తగ్గిపోయిందన్నారు. దీంతో 15 గేట్ల ఎత్తి 1,05,540 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 11 యూనిట్ల ద్వారా ఉత్పత్తి కొనసాగుతోంది. ఇందుకోసం ప్రాజెక్టు నుంచి 30,954 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. 44 క్యూసెక్కుల నీరు ఆవిరవుతుండగా.. ఎడమ కాల్వకు 290, కుడి కాల్వకు 390 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.010 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు వివరించారు.

233 మి.యూ. విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతోంది. బుధవారం ఎగువ కేంద్రంలోని 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 132.696 ఎం.యూ., దిగువ కేంద్రంలోని 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 100.836 ఎంయూ విద్యుదుత్పత్తి చేపట్టామని ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు వివరించారు. రెండు కేంద్రాల్లో ఇప్పటి వరకు 233.532 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించామని చెప్పారు.

సరళాసాగర్‌కు కొనసాగుతున్న వరద

మదనాపురం: సరళాసాగర్ జలాశయం ద్వారా ఏడువేల క్యూసెక్కుల నీరు విడుదల విడుదలవుతుంది. బుధవారం మూడు వుడ్ సైఫాన్లు నిరంతరంగా నడుస్తున్నాయి. ఒక్కొక్క సైఫన్ నుంచి 2,300 క్యూసెక్కులు విడుదలవుతుంది. మదనాపురం వాగు పొంగడంతో పారడంతో కొత్తకోట, మదనాపురం, ఆత్మకూరు, అమరచింత మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

రామన్‌పాడు నుంచి 7 వేల క్యూసెక్కులు

మదనాపురం: రామన్‌పాడు జలాశయం ద్వారా 7 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదిలారు. బుధవారం కోయిల్ సాగర్, మన్నెవాగు, ఊకచెట్టు వాగు వరద, సరళాసాగర్, శంకర సముద్రం నుంచి వచ్చే వరద నీరు తగ్గుముఖం పట్టింది. మూడు గేట్లు ఎత్తి 7 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

4 గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంలో నాలుగు గేట్ల ద్వారా నీటిని విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 18,911 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా..17,916 క్యూసెక్కులు, కేసీ కెనాల్ కు 995 క్యూసెక్కులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.



తెగిన కేఎల్ఐ కాల్వలు


వెల్దండలో కేఎల్ఐ కాల్వ తెగిపోవడంతో వృథా అవుతున్న నీరు

వెల్దండ: మండల కేంద్రం లక్ష్మాపురం సమీపంలోని కేఎల్ఐ కాల్వ బుధవారం తెల్లవారుజామున తెగిపోయింది. కాల్వ నీరు ముందుకు వెళ్లలేక కాల్వకు గండి పడినట్లు రైతులు పేర్కొన్నారు. గతంలోనే కేఎల్ఐ అధికారులకు కాల్వ తెగిపోయే ప్రమాదం ఉందని ముందుగానే సమాచారం ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని కాల్వకు మరమ్మతు చేయాలన్నారు. ఇప్పటి వరకు దాదాపుగా 5సార్లు ఒకేచోట తెగిపోతుందన్నారు. కాల్వ తరచుగా తెగిపోవడంతో సాగుచేసిన పంటలు నీటమునుగుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని తిమ్మరాసిపల్లి సమీపంలో కేఎల్ఐ కాల్వకు గండి పడటంతో నీరంతా పంట పొలాలను ముంచెత్తుతోంది. కేఎల్ఐ 29వ ప్యాకేజీకి శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టక పోవడంతో నీటి ఉధృతికి కాల్వలకు గండ్లు పడి నీరంతా వృథా కావడంతో పాటు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. కాల్వలకు గండ్లు పడి నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వెదురు ఉత్పత్తులతో పర్యావరణ పరిరక్షణ

లింగాల: వెదురు ఉత్పత్తులు పర్యావరణాన్ని పరిరక్షిస్తాయని.. అలాగే వెదురుతో హస్తకళలు, కళాకండాలు, గృహోపకరణాలు, మరెన్నో తయారుచేసి ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని తమిళనాడుకు చెందిన వెదురు డిజైనర్ మోహన్‌ఖన్నా అన్నారు. కేంద్ర ప్రభుత్వ హస్తకళల శాఖ ద్వారా రాష్ట్రానికి ఒక వెదురు ఉత్పత్తుల శిక్షణా యూనిట్ మంజూరు కాగా.. అది మాతృభూమి సంస్థ ఆధ్వర్యంలో లింగాలలో ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాన్ని మోహన్‌ఖన్నా బుధవారం పరిశీలించి మాట్లాడారు. గడ్డి జాతికి చెందిన కలపను ఉపయోగించి వివిధ ఆకృతులలో ఉత్పత్తులు, పరికరాలు తయారు చేయవచ్చని, ఇవి నిత్య జీవితంలో మందుల నిల్వ, ఇంటి నిర్మాణాలు, గృహోపకరణాలుగా వాడుకోవచ్చని అన్నారు. మాతృభూమి సంస్థ అధ్యక్షుడు రమాకాంత్ మాట్లాడుతూ.. వెదురు ఉత్పత్తుల తయారీలో 30 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం నుంచి లింగాలకు శిక్షణా యూనిట్ మంజూరు కావడం గొప్ప విషమన్నారు. త్రిపుర, అస్సాం, ఒడిశా, పశ్చిమ బెంగా, ఈశాన్య రాష్ట్రాలలో మాత్రమే వెదురు ద్వారా కొత్త కొత్త వస్తువులు, ఉత్పత్తులు తయారు చేసి ప్రపంచంలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారని, అలాంటి అవకాశం మనకు దక్కబోతుందని అన్నారు. కేంద్రంలో ట్రైనర్ కృష్ణయ్య మహిళలకు వెదురుతో పరికరాల తయారీపై శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ మంజుల, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

నీటితొట్టిలో పడి చిన్నారి మృతి


గౌతమి(ఫైల్)

గండేడ్: పశువులకు నీళ్లు తాగించే నీటి తొట్టిలో ప్రమాదవశాత్తు ఓ చిన్నారి బాలిక పడి మృతి చెందిన సంఘటన గండేడ్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గండేడ్ మండలంలోని రుసుంపల్లికి చెందిన కోస్గి హరి, శ్రీలతలకు బాబు, పాప ఉన్నారు. బాబుకు మూడేళ్లు, పాప గౌతమికి రెండేళ్లున్నాయి. హరి ఇంటి పెరట్లో పశువుల కోసం సిమెంట రింగులతో నీటితొట్టిని నిర్మించాడు. భార్యాభర్తలు పిల్లలను తాత రామయ్యతో వదిలి పొలం పనులకు పోయేవారు. బుధవారం కూడా పిల్లలను తాతతో వదిలి పొలానికి వెళ్లారు. ఉదయం 11గంటల సమయంలో పిల్లలు బయట ఆడుకుంటూ ఉండగా, అన్నం తీసుకరావడానికి ఇంట్లోకి వెళ్లాడు. ఈ క్రమంలో పాప ఆడుకుంటూ వెళ్లి నీటితొట్టిలో పడింది. దీన్ని గమనించని తాత కొద్దిసేపు అటుఇటు వెతుకగా, నీటితొట్టిలో కనిపించింది. బయటికి తీసి చూడగా అప్పటికే మృతి చెందింది. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో ఇంటికొచ్చి గుండెలవిసేలా రోధించారు. వారి రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. చిన్నారి మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.

కబ్జాలపై దృష్టి మరల్చేందుకే కూల్చివేతలు

- పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాజకీయ నాయకులు చేసిన కబ్జాల పర్వాన్ని పక్కకు పెట్టి ప్రజల దృష్టి మరల్చేందుకే మహబూబ్‌నగర్ పట్టణంలోని సర్వే నెంబర్ 523లో పేదల ఇళ్లను కూల్చివేశారని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నెంబర్ 523లో అక్రమాలు జరగడానికి ప్రధాన కారణం మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయమేనని, సంబంధిత అధికారులపై పూర్తిస్థాయి విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ భూముల కబ్జా, అక్రమాలకు పాల్పడిన వారి వివరాలను అర్బన్ తహసీల్దార్ కార్యాలయం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 523లో ఒక్కటే బూచిగా చూపి రాజకీయ నాయకులు తమ తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయడం విడ్డూరమన్నారు. ప్రతి కుటుంబానికి గూడు కనీస అవసరమని, అలాంటి గూడు నిర్మించుకొని బతుకుతున్న పేదలపై ప్రతాపం చూపడం సరికాదన్నారు. చెరువులు, గుట్టలు చెరబడుతున్న వారిని వదిలి పేదల ఇళ్లను కూల్చడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు సృష్టించి అమ్మిన వ్యక్తులు ఎవరో తెలిసినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, పదేళ్ల పనితీరుపై ఆగ్రహించిన ప్రజలు బీఆర్ఎస్‌ను పక్కకు పెట్టి కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. వరదలు, విపత్తులకు కారణం రాజకీయ నాయకులేనన్నారు. తప్పులను ఎత్తిచూపితే ప్రభుత్వం గతంలో మాదిరి కేసులు చేస్తుందని ఆరోపించారు. వరదలు, కరువును శాశ్వత విపత్తుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కాపాడాలన్నారు. మూసీ ప్రక్షాళనతో వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడే అవకాశమున్నందున ప్రభుత్వం ఎలాంటి నష్టం వాటిళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. రీజినల్ రింగ్‌రోడ్ ద్వారా బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక నాయకులు ఎస్‌ఎం ఖలీల్, హనుమప్ప, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు..

- పీయూ అధ్యాపకుడు కిషోర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు
- మొక్క ఎదుగుదలకు ఉపయోగపడే 'మైక్రోరైజా' ఫంగస్ అభివృద్ధికి కృషి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో మైక్రోబయోలజీ డిపార్ట్‌మెంట్‌లో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్.కిషోర్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. 2009 నుంచి పీయూలో విధులు నిర్వహిస్తున్న ఆయన.. వివిధ అంశాలపై విస్తృతమైన పరిశోధనలు చేశారు. జాతీయ, అంతర్జాతీయస్థాయి జరనల్స్‌లో 52 పరిశోధనలు ప్రచురితమయ్యాయి. ముఖ్యంగా ఆయన బయోఫర్టిలైజర్స్‌పై పరిశోధన చేసి మొక్క ఎదుగుదలకు పౌష్టికాహారాన్ని అందించే 'మైక్రోరైజా' అనే బ్యాక్టీరియా అభివృద్ధిలో తనవంతు కృషి చేశారు. దీంతో పలు బయోఫర్టిలైజర్స్ కంపెనీలకు సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. తెలుగు అకాడమీలో డిగ్రీ సైన్స్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా 5 సైన్స్ పుస్తకాలను ప్రచురించారు. ఇప్పటి వరకు ఆయన ఆధ్వర్యంలో శ్రీనివాస్ పరిశోధనలు చేసి ఇటీవల డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం మరో ఐదుగురు రీసెర్చ్ స్కాలర్స్ పరిశోధనలు నిర్వహిస్తున్నారు. ఔషధ మొక్కలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రాజెక్టు పొంది, అందులో పనిచేస్తున్నారు.

బాధ్యత మరింత పెరిగింది..

కొన్నేళ్లుగా పీయూలో అందిస్తున్న సేవలను గుర్తించి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక చేయడం మరింత బాధ్యత పెంచింది. విధుల్లో చేరిన నాటి నుంచి రీసెర్చ్ విద్యార్థుల అభివృద్ధి కోసం కృషిచేశా. వివిధ అడ్మినిస్ట్రేటివ్ పరమైన అంశాల్లో కూడా విధులు నిర్వహించాం. విధి నిర్వహణలో కుటుంబసభ్యులు, తోటి అధ్యాపకులు ఎంతో సహకరించారు. వారికి కృతజ్ఞతలు.

– డాక్టర్ ఎస్.కిషోర్, పీయూ అధ్యాపకుడు, మైక్రోబయోలజీ డిపార్ట్‌మెంట్

జడ్చర్ల డిగ్రీ కళాశాలకు అరుదైన ఘనత

- రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా డా.మాధురి, డా.సులేమాన్ ఎంపిక

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు అరుదైన ఘనత దక్కింది. కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న ఇద్దరికి రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. మైక్రోబయోలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎ.మాధురి, కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎండీ సులేమాన్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు.

■ 2008లో మైక్రో బయోలజీలో మాస్టర్స్ పట్టా పొందిన మాధురి.. 2011లో డిగ్రీ కళాశాల అధ్యాపకురాలిగా విధుల్లో చేరారు. 2016లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 12 ఏళ్ల బోధనానుభవం కలిగిన ఆమె.. అనేక విద్యార్థి ప్రాజెక్టులకు సమన్వయకర్తగా వ్యవహరించారు. జిజ్ఞాసలాంటి రాష్ట్రస్థాయి విద్యా ప్రాజెక్టులో బహుమతులు సాధించారు. మైక్రోబయోలజీ, బయో టెక్నాలజీకి సంబంధించిన 25 పుస్తకాలు ప్రచురించడంతో పాటు వాటిని జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో పరిశోధనా పత్రాలు వెలువరించారు. ఆమె సేవలకు గుర్తింపుగా డా.జాకీర్ హుస్సేన్ స్మారక ట్రస్ట్, అబ్దుల్ కలాం రాష్ట్రీయ పురస్కారాలను ప్రదానం చేశారు. భారత మైక్రో బయోలజీ సొసైటీ తెలంగాణ శాఖ అధ్యక్షురాలిగా పనిచేశారు. మైక్రో బయోలజీ అంశాలకు సంబంధించి జాతీయ, అంతర్జాతీయ పత్రికలకు సమీక్షకురాలిగా వ్యవహరిస్తున్నారు. టీసాట్ నిపుణ చానెల్‌లో అనేక అంశాలపై 8 ప్రత్యక్ష బోధన తరగతులను నిర్వహించారు. 8 ఏళ్లుగా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తగా సేవలందిస్తున్నారు. వీటన్నింటితో పాటు వృత్తిపరమైన సంఘాలలో జీవితకాల సభ్యురాలిగా కొనసాగుతున్నారు.

కష్టాన్ని మర్చిపోయేలా..



రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు రావడం నాపై మరింత బాధ్యత పెంచినట్లయ్యింది. బేగంపేట కళాశాల నుంచి జడ్చర్లకు బదిలీ అయ్యాక నిత్యం ట్రావెల్ చేయడం కొంత కష్టంగా అనిపిస్తున్న తరుణంలో అవార్డు రావడం సంతోషంగా ఉంది. కష్టాన్ని మరిచిపోయేలా చేసింది. నా విధి నిర్వహణను మరింత బాధ్యతాయుతంగా చేయడానికి స్ఫూర్తిగా మారుతుంది.

–డా. ఎ.మాధురి, అసిస్టెంట్ ప్రొఫెసర్, బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల, జడ్చర్ల

■ 2006లో ఉస్మానియా యూనివర్సిటీలో ఎంకాం, ఎంఫిల్, పీహెచ్‌డీ పొందిన డా. ఎండీ సులేమాన్.. 2013 జనవరిలో అమ్రాబాద్ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకుడిగా నియామకయ్యారు. 2018లో మహబూబ్‌నగర్ ఎంవీఎస్‌కు బదిలీ కాగా.. ఇటీవల జడ్చర్ల కళాశాలకు బదిలీపై వచ్చారు. 15 ఏళ్ల బోధనా అనుభవంలో వాణిజ్యశాస్త్రంపై తలపెట్టిన 12 పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 25 జాతీయ సెమినార్‌లలో పేపర్ ప్రజెంటేషన్ గావించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఫైనాన్షియల్ అకౌంటింగ్‌పై ఒక పుస్తకాన్ని రాశారు. అదే విధంగా జాతీయ సెమినార్‌లకు స్పీకర్‌గా వెళ్లారు. కరోనా సమయంలో విద్యార్థులకు వెబ్ ద్వారా బోధన సాగించడం.. బోధనలో నూతన విధానాలు అమలుచేస్తూ నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకు కృషిచేస్తున్నారు. వాణిజ్యశాస్త్రంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చేందుకు కీలకపాత్ర పోషిస్తుండటంతో రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు.

12 పరిశోధనలు.. 25 సెమినార్లు



వాణిజ్య శాస్త్రంలో చేస్తున్న సేవలకు అవార్డు రావడంతో తగిన గుర్తింపు లభించినట్లయ్యింది. వాణిజ్య శాస్త్రంలో 12 పరిశోధనలు, 25 సెమినార్‌లలో పేపర్ ప్రజెంటేషన్, ఫైనాన్షియల్ అకౌంటింగ్‌పై ఒక పుస్తకం రచన, జాతీయ సెమినార్‌లలో స్పీకర్‌గా పనిచేశాను. నూతన విద్యా విధానాల అమలుకు నావంతు పాత్ర పోషించాను. అవార్డు రావడం నా బాధ్యతను మరింత పెంచుతుంది.

– ఎండీ సులేమాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్, బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల, జడ్చర్ల

జాతీయస్థాయిలో రాష్ట్ర జట్ల ప్రతిభ

- రెండు విభాగాల్లో ద్వితీయ, సీనియర్‌లో మూడోస్థానం


పతకాలు సాధించిన రాష్ట్ర జట్లతో షకీల్ అహ్మద్

మహబూబ్‌నగర్ క్రీడలు: బీహార్ రాష్ట్రం ఆరా బోజ్‌పూర్‌లో ఈనెల 2 నుంచి బుధవారం జరిగిన జాతీయస్థాయి గోగేమ్‌లో రాష్ట్ర జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచినట్లు గోగేమ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సీనియర్ ఉపాధ్యక్షులు మహ్మద్ షకీల్ అహ్మద్ తెలిపారు. ఈ పోటీల్లో పేయిర్ ఈవెంట్‌లో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో ద్వితీయ స్థానం, సీనియర్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. భవిష్యత్‌లో క్రీడాకారులు రాణించాలని ఆయన కోరారు.

ఉలిక్కిపడ్డ చిన్నోనిపల్లె

- గ్రామంలోకి రిజర్వాయర్ వెనుక జలాలు
- భయాందోళనకు గురైన గ్రామస్తులు

చిన్నోనిపల్లి రిజర్వాయర్ సమాంతర కాల్వలో అడ్డుగా ఉన్న బండరాయిని సోమవారం సాయంత్రం బ్లాస్టింగ్ చేసి తొలగించడంతో అదనంగా వచ్చిన నీరంతా బయటకు వెళ్లడం ప్రారంభమైంది. ఇంకేముంది.. ముంపు సమస్య తీరినట్లేనని గ్రామస్తులు రాత్రి హాయిగా నిద్రపోయారు. మంగళవారం రాత్రి భారీ వర్షం కురవగా.. బుధవారం తెల్లవారుజామున లేచి చూసేసరికి ఇంటి ఆవరణల్లో రిజర్వాయర్ బ్యాక్ వాటర్ చేరడంతో ఊరు ఊరంతా ఒక్కసారిగా ఉలిక్కి పడింది.


ఇంటి ఆవరణలో నిలిచిన నీరు

గట్టు: ఊరికి అనుకొని రిజర్వాయర్ బ్యాక్ వాటర్.. ఊరు విడిచి మరో చోటుకు వెళ్లలేని పరిస్థితుల్లో చిన్నోనిపల్లె గ్రామస్తులు ఉన్నారు. ఎప్పుడు ఏమవుతుందో తెలియని అయోమయస్థితిలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా చిన్నోనిపల్లె సమీపంలో 1.5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి 2006లో అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముంపు గ్రామంగా ప్రకటించి అంతంపల్లి, చిన్నోనిపల్లె గ్రామాల మధ్యలో ఉన్న ఎర్రగట్టు వద్ద పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయినా చాలామంది గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. 2023, మార్చిలో అసంపూర్తిగా వదిలేసిన రిజర్వాయర్ కట్ట గ్యాప్‌ను సగం వరకు పూడ్చడంతో గ్రామానికి రెండువైపులా ఉన్న వాగుల్లోని వర్షపు నీరు రిజర్వాయర్‌లో నిల్వ ఉంటుంది. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని.. ఉమ్మడి జిల్లాలోని వట్టెంలో ముంపు గ్రామస్తులకు ఇచ్చిన మాదిరిగా పరిహారం ఇవ్వాలంటూ చిన్నోనిపల్లె గ్రామస్తులు ఏడాదిగా ఆందోళన చేస్తున్నా.. వీరి మొరను ఎవరూ ఆలకించడం లేదు. న్యాయం చేయాలంటూ దేశ రాజధాని ఢిల్లీ వరకు వెళ్లినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలకు రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరిగి గ్రామంలోకి చేరుతోంది.

ఇవీ సమస్యలు..

ముంపు గ్రామంలో గతేడాది సగం మందికి మాత్రమే షిఫ్టింగ్ చార్జీలు (ముంపు గ్రామం నుంచి పునరావాస కేంద్రానికి తరలించేందుకు ఇచ్చే డబ్బులు) ఇచ్చారని.. మిగిలిన వారికి ఇవ్వలేదని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన వారు గ్రామంలో చాలామంది ఉన్నారని.. వారికి పునరావాస కేంద్రంలో ప్లాట్లు ఇవ్వడం లేదని వాపోతున్నారు. 16 ఏళ్ల క్రితం చెల్లించిన పరిహారం డబ్బులు ఖర్చయ్యాయని.. పునరావాస కేంద్రంలో ప్రస్తుతం కొత్త ఇంటి నిర్మాణానికి డబ్బులు సరిపోవడం లేదని తెలిపారు. పునరావాస కేంద్రంలో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించలేదని.. అలాంటి చోట ఇళ్ల నిర్మాణం ఏ విధంగా చేపట్టాలని ప్రశ్నిస్తున్నారు. ముందస్తు సమాచారం ఇస్తే తాము గ్రామాన్ని ఖాళీ చేసే వాళ్లమని.. చెప్పాపెట్టకుండా రిజర్వాయర్ నింపడం ఎంతవరకు సమంజసమని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలంలో బోరు నీటి ఆధారంగా సాగు చేసుకున్న పంటలు నీట మునిగిపోవడంతో పెట్టుబడి నష్టపోయినట్లు రైతులు వాపోయారు.

తేలు కాటుకు యువకుడు మృతి

గట్టు: చిన్నోనిపల్లెకి చెందిన వడ్డే మల్లేష్(19) తేలు కాటుకు గురై గద్వాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నోనిపల్లెకి చెందిన బడేసాబ్ కుమారుడు వడ్డే మల్లేష్ మరికొంత మంది కూలీలతో కలసి గ్రామ శివారులో రైతు పొలంలో వరి నాటు వేసేందుకు వెళ్లాడు. అయితే వరి నాటు వేస్తున్న క్రమంలో వడ్డె మల్లేష్‌తో పాటుగా మరో కూలీ వడ్డె గోవిందుకు తేలు కాటు వేసింది. వడ్డె మల్లేష్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం గద్వాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సంఘటనతో కుటుంబంలో విషాదం నెలకొంది.

గుండూరులో స్వైన్‌ఫ్లూ కలకలం

కల్వకుర్తి రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని గుండూరులో స్వైన్‌ఫ్లూ కలకలం రేపింది. గ్రామానికి చెందిన బాషమోని గోపాల్ గత నెల 27న దగ్గు, జ్వరం, జలుబుతో బాధపడుతూ కల్వకుర్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. అయినా తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని చెస్ట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని తిరిగి గ్రామానికి వచ్చాడు. అక్కడ తీయించుకున్న రిపోర్టులు పరిశీలించిన వైద్యుల బృందం గోపాల్‌కు స్వైన్‌ఫ్లూ పాజిటివ్‌గా తేల్చారు. వెంటనే జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు సమాచారం ఇచ్చారు. బుధవారం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమ్లానాయక్ బృందం గుండూరును సందర్శించారు. ఈ సందర్భంగా గోపాల్ ఇంటి వద్ద వివరాలు సేకరించారు. ఎలాంటి మందులు వేసుకోవాలో వివరించారు. ప్రస్తుతం గోపాల్‌కు పరీక్షలు చేయగా.. నెగిటివ్ వచ్చి ఆరోగ్యంగానే ఉన్నాడు. వైద్య బృందం గ్రామంలో పర్యటించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వైద్యబృందం గ్రామంలో పర్యటించాలని ఎప్పటికప్పుడు ఆరోగ్యంపై దృష్టి సారించాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రదీప్‌కుమార్ ఆదేశించారు.